

మేయర్‌ను కలసిన బెహరా

విశాలాంధ్ర-సింహాచలం : గ్రేటర్ విశాఖ విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ను బెహరా భాస్కరరావు మర్యాద పూర్వకంగా ముస్లిం సోదరులతో కలిశారు. ఈ సందర్భంగా 92వ వార్డు వెంకటాపురంలో ముస్లింలకు స్మశానం మరియు కమేల, కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని అలాగే ఎస్సి, బిసి కాలనీ, వెంకటాపురంలలో రోడ్లు మరియు కల్వర్టులను ఏర్పాటు చేయడానికి వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ నాగూర్, షేక్ బురాన్, షేక్ రెహమాన్, యాసీన్, షేక్ నబీసా, షేక్ బాబ్జి, మస్తాన్ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రసాద్' పథకం నిధుల దుర్వినియోగం కారణంగా సింహాచలంలో విషాదం!

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపణ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : పర్యాటక శాఖ "ప్రసాద్" పథకం నిధుల దుర్వినియోగం ఫలితంగా సింహాచలం దేవస్థానంలో యాత్రికుల విషాద మరణానికి దారితీసిందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రభుత్వ ప్రసాద్ పథకానికి సంబంధించి పర్యాటక శాఖ సివిల్ పనుల కోసం విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై తక్షణ విచారణను చేపట్టాలన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రధాన విజిలెన్స్ కమిషనర్, రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, రాష్ట్ర ముఖ్యమంత్రికి, టూరిజం మంత్రికి తాను ఫిర్యాదు చేశానన్నారు. ఏప్రిల్ 30న ఆంధ్రప్రదేశ్‌లోని సింహాచలం దేవస్థానం చందనోత్సవం పండుగ నిర్వహించిందని, ఆ పండుగ సమయంలో ప్రసాద్ పథకం (తీర్థయాత్ర పునరుజ్జీవనం మరియు స్పిర్చువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) కింద కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇటీవల నిర్మించిన రిటైనింగ్ వాల్ కూలిపోవడం వల్ల ఒక పెద్ద విషాదం సంభవించిందన్నారు. దీని కారణంగా 7మంది అమాయక యాత్రికులు ప్రాణాలు కోల్పోయారని, అనేకమంది తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక అనుమతులు లేకుండా, ఆలయ మాస్టర్ ప్లాన్‌ను ఉల్లంఘించి ఈ నిర్మాణం నిర్మించబడిందన్నారు. పర్యాటకశాఖ అధికారులు వారి అవకతవకలను కనుగొనడానికి విచారణ జరపాలన్నారు. బాధ్యుల నుంచి పరిహారాన్ని వసూలు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ యాత్రి నివాస్‌లో కేవలం పునరుద్ధరణ, అప్‌గ్రేడేషన్ కోసం 8.6 కోట్ల నుండి 13.5 కోట్లకు సవరించిన అంచనా మార్పులను చేసింది, అయినప్పటికి ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదన్నారు. అనంతగిరి రిసార్ట్, అరకులోని టైడా జంగిల్ బెల్స్ వంటి అనేక ప్రదేశాలలో అంచనా విలువలు పెంచారు. రుషికొండ పునరాభివృద్ధి పర్యాటక ప్రాజెక్టులో నిర్మాణ అంచనా విలువ 210 కోట్లు నుండి 485 కోట్లకు పెంచేసారని విమర్శించారు. అధికారులు, కాంట్రాక్టర్లు స్వంత లాభాల కోసం మోసపూరితంగా అంచనాలను పెంచేశారని అధికారుల తీరు పట్ల ధ్వజమెత్తారు. పర్యాటకం, ప్రసాద్ పథకం రెండింటి యొక్క సవరించిన అంచనా కార్యకలాపాల మొత్తం పనుల్లో ఒకే టూరిజం అధికారుల బృందం పాలుపంచుకుందన్నారు. జీవీఎంసీ లో జి 20 సమ్మిట్ పనుల్లో దాదాపు 150 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. స్మార్ట్ సిటీ అభివృద్ధికి కేటాయించిన వందల కోట్ల రూపాయలు పనుల్లో అక్రమాలు అవినీతి జరిగిందని, ఈ పనులలో దేనిపైనా నేటికీ నాణ్యతా తనిఖీలు జరగకపోవడం గమనించదగ్గ విషయం అన్నారు. విచారణ పెండింగ్‌లో ఉన్న పనులు కు చెల్లింపులు, వాటి బిల్లులను నిలిపివెయ్యాలని కోరుతున్నానన్నారు.

ఘనంగా సీపీఐ పెందుర్తి ఏరియా సమితి 2వ మహాసభ

- మండల సమితి కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసరావు ఎంపిక
- ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు

విశాలాంధ్ర-పెందుర్తి : సిపిఐ పెందుర్తి ఏరియా సమితి 2వ మహాసభలు సుజాత నగర్ సమీపంలోని, బర్ధన్ నగర్ కాలనీలో సీనియర్ పార్టీ సభ్యులు వై.త్రినాథ్ అధ్యక్షతన మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ మహా సభకు పెందుర్తి ప్రాంత శాఖల నుంచి 46 మంది ప్రతినిదులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు హాజరై శ్రేణులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పెందుర్తి మండల ప్రాంతం ప్రజలు అన్ని రాజకీయ పార్టీలను ఆదరిస్తారని, సిపిఐ నుంచి పూర్వం పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా మానం ఆంజనేయులు గెలుపొందిన తర్వాత వేలాదిమంది నిరుపేదలకు ఇళ్ల కల్పించారని, ముదపాక తదితర ప్రాంతాల్లో రైతులకు ఎన్నో ఎకరాల భూములను పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఇక్కడ నుంచే జాతీయ స్థాయిలో కొన్ని పార్టీల్లో నేతలు గుర్తింపు పొందారని మానం ఆంజనేయులు కూడా కాల్ టాక్స్ ఉద్యమాన్ని జాతీయ స్థాయిలో పోరాటాలు నిర్వహించి సిపిఐ లో జాతీయ నాయకులుగా గుర్తింపు పొందారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. పార్టీ నాయకులు, సభ్యులు స్థానిక, ప్రజా సమస్యలపై రాజీలేని, అలుపెరగని పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు మాట్లడుతూ సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభలకు మే 10న బహిరంగ సభకు కార్మికులను, ప్రజలను వందలాదిగా తరలించేందుకు పార్టీ నాయకులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పెందుర్తి మండలం ఏరియా సమితి నూతన కమిటి ఎన్నిక : మహాసభలలో పెందుర్తి మండల ఏరియా సమితి నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. కార్యదర్శిగా రెంటికోట శ్రీనివాసరావు, సభ్యులుగా ఎరిపిల్లి రాంబాబు, నేతింటి అసిరి నాయుడు, మొగులు రాము, అంపవల్లి అన్నపూర్ణ, కక్కల రజినీలతో కూడిన ఏరియా సమితి కమిటీని అధ్యక్షులు ప్రతిపాదించగా మిగిలిన 40 మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా మహాసభలు రెండవ రోజు మే11 న జరగబోయే ప్రతినిదుల సభకు 10 మంది ప్రతినిధులుగా వెళ్లేందుకు ఎంపిక చేశారు. నూతన కమిటి మండల ఏరియా సమితి కేంద్రంగా ప్రజా సమస్యలపై ఇతర శాఖలను కలుపుకొని పనిచేస్తుందని జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు తెలిపారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి : మంత్రి

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : జీవనోపాధి అభివృద్ధి పరచుకొని మరింత వృద్ధిచెందేలా స్వయం సహయాక సంఘ మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదిగేలా ప్రణాళికలు చేసి అమలు చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విశాఖపట్నంలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ముఖ్య కార్య నిర్వహణాధికారి వాకాటి అరుణ అధ్యక్షతన జిల్లా గ్రామీనాభివృద్ధి సంస్థ పథక సంచాలకుల రాష్ట్ర స్థాయి సమావేశము ఎంఎస్ఎంఈ మంత్రి వర్యులు శ్రీ కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, అంతర్గత అప్పులు ఇతర ఋణ సదుపాయాలు ఉపయోగించుకొని స్వయం సహయాక సంఘాల సభ్యులు వారి జీవనొపాదులను అభివృద్ధి చేసుకోవాలి అన్నారు. ఈ సమావేశములో వార్షిక ఋణ మరియు జీవనోపాదుల ప్రణాళిక జీవనోపాదుల ప్రణాళిక 2025-25 ల కార్యాచరణపై జిల్లాల పథక సంచాలకులు, సిబ్బందితో సమీక్షా జరిగింది. ప్రతీ నియోజక వర్గం నందు ఎంఎస్ఎంఈ పార్క్ (ఇండస్ట్రియల్ పార్క్) లను ఏర్పాటు చేయడంపై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కార్య నిర్వహణాధికారి ఆర్. శ్రీరాముల నాయుడు గారు, సంస్థకు చెందిన వివిధ విభాగాల సంచాలకులు, రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లా గ్రామీనాభివృద్ధి సంస్థల పథక సంచాలకులు మరియు వివిధ విభాగాల జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు పాల్గొన్నారు.

స్వర్గీయ యేళ్లేటి రామారావు సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-పెదగంట్యాడ : కమ్యూనిస్ట్ పార్టీ నేతగా ఉక్కు నిర్వాసిత నాయకునిగా అనేక సేవలు అందించిన స్వర్గీయ ఏల్లేటి రామారావు సేవలు స్ఫూర్తి దాయక మని సిపిఐ రాష్ట్ర సమితి కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె.స్టాలిన్ పేర్కొన్నారు. స్వర్గీయ యెల్లెటీ రామారావు 20వ వర్ధంతి పెద గంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో సోమవారం ఘనంగా జరిగింది. సిపిఐ నాయకులు, కార్యకర్తలు రామారావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ స్వర్గీయ రామారావు గాజువాక తొలి మున్సిపాలిటీ 18 వార్డు కౌన్సిలర్‌గా, కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శిగా, ఉక్కు నిర్వాసిత నాయకునిగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. సిపిఐ నాయకులు ఎల్లె టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పేదలకు నిత్యావసర సరుకులు, చీరలు అతిథులు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమం లో సిపిఐ గాజువాక నియోజక వర్గ సీపీఐ కసి రెడ్డి సత్యనారాయణ, జి.ఆనంద్, పి.దుర్గా రావు, వల్లే టి పోలయ్య, టిడిపి నాయకులు పులి రమణా రెడ్డి , ఐఎన్‌టియూసి నాయకులు మంత్రి గోపి నారాయణ, వై.దేముళ్ళు పాలేశెట్టి రామారావు, బి గణేష్, ఊరుకుటి వెంకట రావు లతో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గీతంలో డెమ్‌కాన్ 25 వెబ్‌సైట్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్‌సర్) ఆతిధ్యంలో ఈ ఏడాది డిసెంబర్ 5,6 తేదీలలో డెమ్‌కాన్-2025 పేరిట జరగనున్న జాతీయ సమావేశాలకు సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్ మరియు గోడ పత్రికను మంగళవారం తేది:06-05-2025న గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమావేశాల నిర్వహక కమిటీ కో-ఛైర్ పర్సన్ మరియు స్నేహ సంధ్య ఏజ్‌కేర్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ జి.సాంబశివరావు, డాక్టర్ కె.కుమార రాజా, డాక్టర్ ఎన్.ఎస్.రాజు, సమావేశాల నిర్వహక కమిటి కార్యదర్శి డాక్టర్ కె.వి.లూ, సహ కార్యదర్శి సి.హెచ్. కిషోర్ కుమార్, జిమ్‌సర్ ఆపరేషన్స్ విభాగం అధిపతి డాక్టర్ బి.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వృధ్ధాప్యంలో ఉన్న వారు ఎదుర్కొనే డెమెన్సియా వంటి ఆరోగ్య సమస్యలు మరియు పలియేటివ్ కేర్‌ల ప్రాధాన్యతను వివరించారు. గీతం ఆతిధ్యంలో జరిగే జాతీయ సదస్సులో డెమెన్సియా ఇండియా అలయన్స్ (డిఐఎ) తో అనుబంధం ఉన్న ప్రసిద్ధ వైద్య నిపుణులు హాజరై వివిధ అంశాలపై చర్చింస్తారని తెలిపారు. గీతం ఆసుపత్రిని డెమెన్సియా అనారోగ్య సమస్యతో ఉన్న వారికి స్నేహ హస్తం అందించి అక్కున చేర్చుకునే వైద్యాలయంగా తీర్చి దిద్దాలని సూచించారు.

చదువుతో సమాజంలో గౌరవప్రదమైన స్థానం లభిస్తుంది

విశాలాంధ్ర-మల్కాపురం : చదువు వల్ల సమాజంలో గౌరవం లభిస్తుందని, జ్ఞానం, నైపుణ్యాలు, ఆలోచనా శక్తి పెరుగుతాయని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ చదువువల్ల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని, ఉద్యోగాలు లభిస్తాయని, వ్యక్తిత్వం వికసిస్తుందని, స్వతంత్ర ఆలోచనలు వస్తాయని అన్నారు. విద్య ద్వారా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లాంటివారు ఎలా అభివృద్ధి చెందారో స్ఫూర్తిదాయకంగా తెలియజేశారు. అనంతరం వాతావరణ కాలుష్యం- నివారణ అనే అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. 35 మంది చిన్నారులు చిత్రలేఖన పోటీలో పాల్గొని చక్కటి చిత్రాలను చిత్రీకరించారు. పోటీని గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు జగదాంబ, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ జ్యోతిర్మయి, పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

దర్శనం టికెట్ల టైపింగ్‌లో తప్పిదం

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి నిజరూప దర్శనం టికెట్ల టైపింగ్ తప్పిదం జరిగినట్లు అధికారులు వివరణ ఇచ్చారు. స్వామివారి నిజరూప దర్శనం సందర్భంగా దేవస్థానం విక్రయించిన టికెట్ల లెక్కపై భక్తుల అనుమానాల నేపథ్యంలో ఈనెల 4న పలు పత్రికల్లో'చందనోత్సవం టికెట్ల కథనాలపై ఇంచార్జ్ ఈవో కె.సుబ్బారావు టికెట్ల లెక్కతో వివరాల నివేదిక అందజేశారు. టైపింగ్ తప్పిదంలో భాగంగానే రెండు నివేదికల లెక్కల్లో తేడాలు వచ్చాయని స్పష్టం చేశారు. అన్ని కేటగిరీలు కలిపి మొత్తం 44,384 టికెట్లు విక్రయించినట్లు వెల్లడించారు. గతనెల 28, 29వ తేదీల్లో జరిగిన విక్రయాల్లో నంబర్లు తప్పుగా లెక్కించినట్లు వివరించారు.

గుండెపోటుతో సిఐటియు నేత అప్పలరాజు మృతి

విశాలాంధ్ర-పెందుర్తి : సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సిపిఎం సీనియర్ నాయకుడు జి అప్పలరాజు గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. సోమవారం సొంతూరు రాజాం వెళ్లిన ఆయన అక్కడే మృత్యువాత పడ్డారు. పార్టీ నాయకులు కుటుంబ సభ్యులు హుటాహుటిన పెందుర్తిలోని ఆయన స్వగృహానికి అప్పలరాజు భౌతిక కాయాన్ని తరలించారు. సమాచారం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, ప్రజాసంఘాల సభ్యులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని అప్పలరాజు మృతదేహానికి నివాళులర్పించారు.

సిఐటియు అప్పలరాజుకు సిపిఐ నాయకులు నివాళి : సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అప్పలరాజు మృతదేహానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు లోకనాథం, వెంకట్రావు, జగన్, రమణి, జిల్లా సమితి సభ్యులు వై.రాంబాబు, పెందుర్తి శాఖ కార్యదర్శి అసిరినాయుడు తదితరులు మంగళవారం ఉదయం పెందుర్తిలో ఆయన నివాసం వద్ద అప్పలరాజు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పలరాజు సిపిఎం పార్టీకి, ముఖ్యంగా జిల్లాలో పేద ప్రజలకు ఎన్నో విధాలుగా సేవలందించారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సీపీఎం, సీపీఐ నాయకులు పేర్కొన్నారు. అప్పలరాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పోటీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అకామిడేషన్ కల్పించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 102 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ఈ రోజు 102 ఫిర్యాదులు రావడం జరిగినది ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత భాగ్చి ప్రత్యక్షముగా పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో సీపీ స్వయంగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసినదిగా ఆదేశాలు ఇచ్చారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి మరియు సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో నగర సబ్-డివిజన్ ఏ.సి.పి లు మరియు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్‌లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ఏయు ఎస్ఎఫ్ఐ ఆందోళనలు

విశాలాంధ్ర-విశాఖ సిటీ : పోటీ పరీక్షలకు హాజరవుతున్న యూనివర్సిటీ విద్యార్థులకు అకామిడేషన్ కల్పించాలని కోరుతూ మంగళవారం ఏయూలో విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏయు ఎస్ఎఫ్ఐ ప్రతినిధి వెంకీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కంపిటేటివ్ పరీక్షలకు హాజరు అవుతున్న విద్యార్థులకు యూనివర్సిటీ అకామిడేషన్ ఇస్తుందన్నారు. ఈ సంవత్సరం విద్యార్థులకు అకామిడేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి కూడా విద్యార్థులను వైస్ ఛాన్సెలర్, రిజిస్టర్, ప్రిన్సిపాల్స్, చీఫ్ వార్డెన్స్ చుట్టూ విద్యార్థులను తిప్పించొకొని చివరకు విద్యార్థులకు నిరాశ మిగిల్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై వైస్ ఛాన్సెలర్ ని కలవడానికి కూడా విద్యార్థులకు పర్మిషన్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎడారిలో ఉన్నట్టు వాటర్ లేదని కబుర్లు చెప్తూ అకామిడేషన్ కల్పించడానికి నిరాకరించడం అన్యాయం అన్నారు. దీనితో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అకామిడేషన్ కల్పించని యూనివర్సిటీలో నాణ్యమైన విద్య ఎలా అందిస్తారని ప్రశ్నించారు. విద్యకు యాజమణ్యం తూట్లు పొడుస్తుందని వాపోయారు. ఆంధ్రయూనివర్సిటీ యాజమాన్యం ఈ గుంటనక్క వైఖరి మార్చుకోవాలన్నారు. ఆంధ్ర యూనివర్సిటీకి ఎంతో ప్రతిష్ట ఉందని మీ పదవుల కోసం, రాజకీయాలతో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దన్నారు. చదువుకునే మూర్ఖుల్లా వ్యవహరించకుండా, నాయకులకు బానిసల్ల కాకుండా విద్యార్థులకు సంక్షేమం కోసం యూనివర్సిటీ అధికారులు ఆలోచించాలన్నారు. యూనివర్సిటీ విద్యర్థుల జీవితాలకు ఉరితాడు వెయ్యాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఆస్తమాపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆస్తమా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాల్సి ఉందని, లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి ఉమామహేశ్వరరావు తెలిపారు. దీర్ఘకాలిక శ్వాససంబంధ రుగ్మతల్లో ఆస్తమా ఒకటని, పీల్చే గాలి ఊపిరితిత్తుల్లోకి వెళ్లడానికి, బయటకు రావడానికి వాయు నాళాలు ఉంటాయి. ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం మే నెలలో మొదటి మంగళవారం నాడు అంతర్జాతీయ ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆస్తమా బాధితులు పెరుగుతున్నారని, ఇందుకు మారుతున్న జీవనశైలి దీనికి ప్రధాన కారణం అన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఈ వ్యాధి సోకుతుందని, ఇందుకు ప్రధాన కారణాలు పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్ తీసుకోవడం, కాలుష్యం పెరిగిపోవడం అంతేకాకుండా దుమ్ము, ధూళి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈ సంవత్సరం ఇన్హేల్ ట్రీట్మెంట్స్ అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి అనే థీమ్ తో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ ఇన్హేలర్ వైద్యులు సూచనల మేరకు మాత్రమే వాడాలి. ఇన్హేలర్ చిన్న పరికరం అని కానీ ఉపయోగించేలా ఉంటుందన్నారు. ఆస్తమా నియంత్రణలో ఇన్హేలర్ చాలా కీలకమైనది. అయితే దాన్ని సరైన రీతిలో వాడకపోతే మందు ఊపిరితిత్తుల లోపలికి చేరదు. చాలామంది రోగులు తప్పుగా వాడటం వల్ల ఆస్తమా బాగా నియంత్రణలోకి రాదని చెప్పారు. ఇన్హేలర్ వాడకం గురించి వైద్యులను అడిగి తెలుసుకోవాలన్నారు.

విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఉద్యోగి భార్యకు చెక్కు అందజేత

- జీవీఎంసీ ఉద్యోగుల కో-ఆపరేటివ్ సొసైటీని వినియోగించుకోండి
- నగర మేయిర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జీవీఎంసీ ఉద్యోగులు కో-ఆపరేటివ్ సొసైటీని సక్రమంగా వినియోగించుకోవాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో మహా విశాఖ నగరపాలక సంస్థ ఉద్యోగి కిలాని గవరరాజు పబ్లిక్ హెల్త్ వర్కర్ గా ఎంప్లాయ్ నెంబర్: 1534 విధులు నిర్వహిస్తూ మరణించినందున వారి భార్య కిలాని వరలక్ష్మికి జీ.వీ.ఎం.సీ. నాన్. పి.హెచ్. ఎంప్లాయిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ చెక్కును రూ.2,83,826/- ను సొసైటీ అధ్యక్షులు వి. వి. వామనరావు ఆధ్వర్యంలో విశాఖ నగర మేయర్ అందించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ కిలాని గవర రాజు సొసైటీ మెంబర్ అయినందున సొసైటీలో ఉన్న ఇన్సూరెన్స్ పథకం కింద అతని ఋణమును పూర్తిగా రద్దు చేసి అతని భార్యకు చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. జీ.వీ.ఎం.సీ. ఉద్యోగులు కో-ఆపరేటివ్ సొసైటీని సక్రమంగా నిర్వహించుకుంటే సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు కూడా ఎంతో మేలు జరుగుతుందని అందులో భాగంగానే చనిపోయిన ఉద్యోగి భార్యకు చెక్కు ఇవ్వడం వలన వారి కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. జీవీఎంసీ ఉద్యోగుల కో ఆపరేటివ్ సొసైటీకి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు వి. వి. వామనరావు, ట్రెజరర్ బి. తాతారావు సొసైటీ మేనేజర్ యర్రా ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

కేర్ హాస్పిటల్స్‌లో నరాల వ్యాధికి విజయవంతమైన అరుదైన చికిత్స

విశాలాంధ్ర-విశాఖపట్నం : అరుదైన నర సంబంధ వ్యాధి వల్ల పూర్తిగా పడుకుపోయిన 35 ఏళ్ల మహిళను తిరిగి నడవగలిగే స్థితికి తీసుకురావడంలో విశాఖపట్నంలోని కేర్ హాస్పిటల్స్ వైద్యులు అద్భుతమైన విజయాన్ని సాధించారు. రాధారాణి అనే మహిళకు న్యూరోమైలిటిస్ ఆప్టికా స్పెక్ట్రం డిసార్డర్ అనే అరుదైన వ్యాధిగా గుర్తించారు. ఈ వ్యాధి కారణంగా ఆమె వెన్నులో తీవ్రమైన వాపు ఏర్పడి, కాళ్లలో చలనం మరియు స్పర్శ పూర్తిగా పోయాయి. ఆమెను ఆసుపత్రికి తీసుకువచ్చిన సమయంలో, కడుపు నుండి కాళ్ల వరకు స్పర్శ లేకుండా, పూర్తిగా పడకపై ఉండే స్థితిలో ఉన్నారు. మెదడు మరియు వెన్నుకు సంబంధించి తీసిన ఎంఆర్ఐ స్కాన్లో, మెడ కింద నుండి మధ్య వెన్నుకి వరకు తీవ్ర వాపు గుర్తించబడింది. ప్రాథమిక రక్తపరీక్షల్లో వ్యాధికి సంబంధించి స్పష్టమైన లక్షణాలు కనిపించక పోయినా, వైద్యులు చికిత్సలో జాప్యం చేయకుండా వెంటనే ప్రత్యేక చికిత్స ప్రారంభించామని కేర్ ఆస్పత్రి సిఓఓ మయూక్ చౌదరి తెలిపారు. మోనోక్లోనల్ యాంటీబాడీ ఆధారిత చికిత్సను అమలు చేశారు. నెల రోజుల వ్యవధిలో రాధారాణికి కాళ్లలో బలం, స్పర్శ తిరిగి వచ్చాయి. ఆమె తిరిగి నడవడం ప్రారంభించి, సాధారణ జీవితం వైపు అడుగులు వేస్తున్నారని ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎం.జి.వి. ఆదిత్య తెలిపారు. "లాంగిట్యూడినల్ ఎక్స్టెండింగ్ ట్రాన్స్‌వర్స్ మైలైటిస్ తో కూడిన న్యూరోమైలిటిస్ ఆప్టికా స్పెక్ట్రం డిసార్డర్ అనేది లక్ష మందిలో ఒకరికి మాత్రమే వచ్చే అరుదైన వ్యాధి. రాధారాణి విషయంలో, గమనించిన వెంటనే ఇచ్చిన ఇమ్యూనోథెరపీ చికిత్సవల్ల ఆమె పూర్తి ఆరోగ్యాన్ని తిరిగి పొందగలిగారు" అని తెలిపారు. ఈ చికిత్సలో సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఏ.వి. వేణుగోపాల్, డాక్టర్ శ్రీనివాస్ తో కూడిన క్రిటికల్ కేర్ బృందం కీలక పాత్ర పోషించారన్నారు. ఐసియు నుంచీ తిరిగి కోలుకునే వరకు విభిన్న విభాగాల వైద్యులు సమన్వయంతో పనిచేశారు.

ఖనిజాల కోసం మరో వేట!

- అడ్డగోలు క్వారీకు ముమ్మర ప్రయత్నాలు
- సర్వే నెంబర్ 37 పి, దెయ్యాలమెట్ట కొండ
- 400 ఎకరాలు కొండపై బడా బాబుల కన్ను
- గ్రామసభ లేకుండా మైనింగ్కు అనుమతులా..?

విశాలాంధ్ర-ఆనందపురం : మండలంలో మరో కొండ మైనింగ్ తెరపైకి వచ్చింది. పచ్చనీ కొండలను మైనింగ్ పేరుతో మాయం చేయడానికి సిద్దంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొండలను తవ్వేసి ఖనిజాలను దోచుకోవడమే అటవీ ప్రాంతాల పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా పావులు కదుపుతున్నారు ఇక్కడ ఎలాంటి గ్రామ సభనూ జరపలేదు. గిరిజనుల అభిప్రాయం తీసుకోలేదు. కొండ పై క్వార్ట్ జైట్ ఖనిజాల తవ్వకాలతో రూ కోట్లకు పడగలెత్తి గిరిజనం ఉపాధిని దెబ్బకొట్టే కుట్రలకు కంపెనీ తాజాగా టెండర్ వేశారని తెలుస్తుంది. ఆనందపురం గ్రామీణంపై కార్పొరేట్లు కళ్ళు పడ్డాయి. ఇక్కడి కొండలను మైనింగ్ క్వారీయింగ్ కోసం అక్రమంగా అనుమతులు పొందడం కొనసాగుతోంది. అడ్డగోలుగా అనుమతులను మంజూరు చేయడంతో ఈ ప్రాంత గిరిజనులకు శాపంగా మారబోతుందా, ఇచ్చాపురం గిరిజన గ్రామం ప్రాంతం కావడంతో. దీనికి సమీపంలోనే చెయ్యాలమెట్ట కొండతోపాటు కోతికొండ, మర్రిమెట్ట, ధారకొండ ఉన్నాయి. ప్రకృతి సిద్ధమైన వాగులు, పచ్చని చెట్లు, జీడి, మామిడి తోటలు, పత్తి పంటలతో అలరారుతున్నాయి. నాలుగువైపులా ఉన్న కొండలు ఇచ్చాపురానికి రక్షణ కవచమని చెప్పవచ్చు. కొండపై సర్వే రాళ్లతో గిరిజనంలో ఆందోళన గత నెల 20న విజయవాడ మైనింగ్ డిపార్టుమెంట్, సర్వే అధికారులు ముగ్గురు. ఇచ్చాపురంలోని దెయ్యాలమెట్టు కొండ దగ్గరకు కార్లలో వచ్చి కొండపై కొన్నిచోట్లు సర్వే రాళ్ళు పాతి, మార్కింగ్ వేసి వెళ్లారని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. ఇచ్చాపురం గిరిజన గ్రామ సమీపంలోనే దెయ్యాలమెట్టు కొండ సర్వే నెంబరు 37/పిలో సుమారు 400 ఎకరాల వరకూ అంతా కొండ ఉండడంతో మైనింగ్ వ్యాపారస్తులు కళ్ళు ఈ కొండలపై పడ్డాయని గిరి పుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా సరే దెయ్యాల మెట్ట కొండపై మైనింగ్ చేపడితే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆ ప్రాంతవాసులు తెలిపారు.

జీవీఎంసీ మెకానికల్ విభాగంపై మేయర్ సమీక్ష

విశాలాంధ్ర-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ మెకానికల్ విభాగంపై మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మట్లాడుతూ జీవీఎంసీలో గల ఎలక్ట్రికల్ వాహనాల తోపాటు జీవీఎంసీ సొంత వాహనాలు, అద్దె వాహనాలు ఎన్ని ఉన్నాయని వాటిని ఏఏ అధికారులకు కేటాయించారని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. నగరంలోని 8 జోన్లలో వ్యర్థాలు తరలించే వాహనాలు ఎన్ని ఉన్నాయని, వాటి నిర్వహణ, ఎన్ని ట్రిప్పులు వ్యర్థాలను తరలిస్తున్నాయి అలాగే జెసిబిలు, లోడర్లు , బాబ్కట్లు, క్లాప్ వాహనాలు, బీచ్ క్లీనింగ్ యంత్రాలు, తదితర వాహనాలు ఎన్ని ఉన్నాయని అవి నిర్వహించే పనితీరు పై జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు (మెకానికల్) గోవిందరావు ను అడిగి తెలుసుకున్నారు. బీచ్ ను శుభ్రం చేసేందుకు బీచ్ క్లీనింగ్ యంత్రాలు ఎన్ని పనిచేస్తున్నాయని, వాటి పనితీరును స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. జీవీఎంసీ వాహనాలకు సంబంధించి అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని అలాగే డీజిల్, పెట్రోలు ఖర్చులు నియంత్రణకు వాహనాలకు జిపిఎస్ సిస్టంతో పాటు డ్రైవర్ల లాగు బుక్కులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని,జీవీఎంసీలో నిరుపయోగంగా ఉన్న వినియోగం లేని వాహనాలను వేలం వేసేందుకు ప్రణాళికాయుతమైన చర్యలు తీసుకోవాలని ప్రధాన ఇంజనీర్ పి శివప్రసాద్ రాజు ను మేయర్ ఆదేశించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నగరంలో ప్రధాన గెడ్డలు, కాలువలలోలోని వ్యర్థాల పూడికల తొలగింపునకు వాటి స్థితిగతులపై ఇప్పటి నుండే చర్యలు తీసుకోవాలని, గెడ్డలను స్వయంగా పరిశీలిస్తానని మేయర్ తెలిపారు. గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద భద్రతా చర్యల దృష్ట్యా సమర్థవంతమైన కాపలాదారులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పరిసర ప్రాంతాలలో నిత్యం పరిశుభ్రంగా ఉండేటట్లు పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ను మేయర్ ఆదేశించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ ప్రధానం ఇంజనీరు కె శివప్రసాద్ రాజు, అదనప కమిషనర్లు డి.వి రమణమూర్తి, ఎస్.ఎస్ వర్మ, కార్యనిర్వహక ఇంజనీరు రత్నాకర్ రెడ్డి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ కీ.శే.హనీఫ్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర-పెందుర్తి : ఆల్ ఇండియా పోర్ట్, డాక్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు అఖిల భారత రేవు కార్మిక సమాఖ్యల కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కీ.శే. కామ్రేడ్ పి ఎం ఎం హనీఫ్ కు ఫోర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం ఘన నివాళులర్పించారు. మే 4న స్వర్గస్తులైన హనీఫ్ మృతికి సంతాప సూచకంగా ఫెడరేషన్ అనుబంధ సంస్థ అయిన పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్‌లో సమావేశం ఏర్పాటు చేసారు. సమావేశంలో యూనియన్ నాయకులు కార్యకర్తలు హనీఫ్ చిత్రపటం వద్ద దీప ప్రజ్వలన చేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ 2 ని.లు మౌనం పాటించి నివాళు లు అర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. కె. శర్మ, ట్రెజరర్ మంగయ్య నాయుడు, ట్రస్ట్ బోర్డు మెంబెర్ కె. వి. ఆంజనేయ రావు సీనియర్ నాయకులు సి. హెచ్.శ్రీనివాస్ ప్రసాద్, యూనియన్ డెలిగేట్స్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జన్మదినోత్సవాన్ని 'తెలుగు జాతి ఆత్మగౌరవం దినోత్సవం' దినంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం : "సమాజమే దేవాలయం - ప్రజలే నా దేవుళ్ళు" అని నినదించి, అట్టడుగు, బడుగు బలహీన వర్గాల ప్రజలు సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేసి, స్వచ్ఛమైన, సమర్థవంతమైన పాలనతో తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచం సలుమూలలా వ్యాప్తి చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని మంగళవారం మధ్యాహ్నం శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడును కలిసి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వినతిపత్రం సమర్పించారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవం దినోత్సవం పై చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ను ఈ సందర్భంగా రామ్ కోరారు. ఇప్పటికే గిడుగు వెంకట రామమూర్తి, పింగళి వెంకయ్య, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, గౌతు లచ్చన్న తదితరులకు ప్రభుత్వ కార్యక్రమంగా చేస్తున్నారని బి.వి.రామ్ తెలిపారు. శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ తప్పకుండా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు చెప్పారు. శాసనసభ సభాపతి కలిసిన వారిలో ఎం.ఎస్.నాయుడు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి, వి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డిస్నీ మార్వెల్ అవెంజర్స్‌తో టాటా గ్లూకో ప్లస్ జెల్లీ ఎంఓయూ

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆహార, పానీయాల పరిశ్రమలో ప్రముఖ సంస్థ అయిన టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (టిసిపిఎల్), ఎక్కువ మంది అభిమానించే తమ టాటా గ్లూకో ప్లస్ జెల్లీ పానీయానికి సూపర్ హీరో శక్తిని అందించటం కోసం డిస్నీ యొక్క మార్వెల్అవెంజర్స్‌తో భాగస్వామ్యం చేసుకుంది. ఈ స్పెషల్ ఎడిషన్ ప్యాక్ అభిమానులకు ఇష్టమైన మార్వెల్ క్యారెక్టర్ల ను కలిగి ఉంది. ఈ భాగస్వామ్యం, ప్రతి ప్యాక్‌కి ఉత్తేజకరమైనమార్వెల్ట్విస్ట్‌ను తెస్తుంది, స్పైడర్ మ్యాన్, ఐరన్ మ్యాన్, కెప్టెన్ అమెరికా, థోర్ మరియు కెప్టెన్ మార్వెల్ వంటి అభిమానులకు ఇష్టమైన క్యారెక్టర్ ల ప్రీమియం సూపర్ హీరో బొమ్మలను ఈ ప్యాక్ కలిగి ఉంటుంది. మాగ్నెటిక్ కీచైన్‌లు మరియు బ్యాగ్ ట్యాగ్‌లు సేకరించదగిన అత్యుత్తమ సంపద గా నిలుస్తుంది. ఈ సంతోషాన్ని మరింత పెంచుతూ స్పైడర్ మ్యాన్, ఐరన్ మ్యాన్ మరియు కెప్టెన్ అమెరికాతో కూడిన మూడు ప్రత్యేకమైన సూపర్ హీరో- కప్పులు కూడా అందుబాటులో ఉంటాయి, ఇవి ప్రతి మార్వెల్ ప్రేమికుడి వద్ద తప్పనిసరిగా ఉండాల్సిన అంశాలు. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్రెసిడెంట్స్ హెడ్ బిజినెస్, పార్థా బిశ్వాస్ మాట్లాడుతూ, "డిస్నీ యొక్క మార్వెల్అవెంజర్స్‌తో భాగస్వామ్యంతో మా కొత్త జెల్లీ ను విడుదల చేయటం మాకు చాలా ఆనందంగా ఉంది.." అని అన్నారు. టాటా గ్లూకో ప్లస్ జెల్లీఉత్తేజకరమైన బబుల్‌గం ఫ్లేవర్ వస్తుంది.

వైభవంగా తిరుమగనార్ తిరునక్షత్రం

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయ సన్నిధిలో వైభవంగా చక్రవర్తి తిరుమగనార్ తిరునక్షత్రం మేష శుద్ధ నవమి పురస్కరించుకొని దీనిని శ్రీరామ జయంతి అని అంటారు ఈ సందర్భంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి విశేష పూజలు నిర్వహించి ఈ మేష శుద్ధ నవమి నాడు ఈ ఉత్సవం జరిపించడం ఆనవాయితి దీనిలో భాగంగా ఈ సందర్భంగా స్వామి సన్నిధిలో గోవిందరాజు స్వామి అలంకరణలో ఉభయ దేవేరులతో పలు అభిషేకాలు వేద పారాయణం నిర్వహించారు అనంతరం స్వామివారిని అందంగా అలంకరించి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు అనంతర: స్తానాచార్యులు వారు మరియు దివ్య ప్రబంధ అధ్యాపకులు , దివ్య ప్రబంధాన్ని మధురం గా గానం చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రకరకాల పుష్ప జాతులతో అందంగా అలంకరించారు శ్రీ స్వామిని చూసిన భక్తులు పులకించిపోయారు.